## కేజీబీవీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తుల ఆహ్వానం

బండ్లగూడ, జూన్ 6: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో 2025 సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి సుజాత శుక్రవాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో బైపీసీ, ఎంఎల్‌టీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

### గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తులు....

ఇంటర్ విద్యా బోధనకు అతిథి అధ్యాపక సిబ్బందిగా బోధించడానికి డెమో ద్వారా తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కేజీబీవీ దర్గా కలీస్ ఖాన్ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు.. తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్ ,కెమిస్ట్రీ ,జువాలజీ ,బోటనీ సంబంధిత సబ్జెక్టులలో బోధించుటకు విద్యార్హతలు బీఈడీ, పీజీ ఉండాలన్నారు.

## గురుకుల విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర...

హిమాయత్ నగర్ , జూన్ 6: రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న 850 గురుకుల విద్యాసంస్థలకు కొన్ని నెలల నుంచి సుమారు రూ.215 కోట్లు అద్దె కిరాయిలు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని చెల్లించి యజమానులు భవనాలకు తాళాలు వేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ విద్యార్థులకు గురుకులాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని అలాంటి గురుకులాలను మూసివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు.

## పీజీడీసీఏ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీడీసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

పీజీడీసీఏ (సీబీసీఎస్) మొదటి, రెండో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లా గ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు.

# బడిబాట ప్రారంభం

- పాఠశాలలకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు..
- ఈ ఏడాది నుంచే విద్యార్థులకు నోట్ పుస్తకాలు..

జూబ్లీహిల్స్, జూన్ 6: నూతన విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శుక్రవారం నుంచి బడి బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒకవైపు అడ్మిషన్ల కోసం పాఠశాల యంత్రాంగం బస్తీలు, కాలనీల్లో క్యాంపెయిన్‌లు నిర్వహిస్తుండగా.. మరోవైపు పుస్తకాలు, యూనిఫాం ల తరలింపు పనులతో పాఠశాల వద్ద సందడి నెలకొంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2, షేక్ పేట్ మండలాలలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, యూనిఫాంలు చేరుకున్నాయి. కాగా ఈ ఏడాది నుంచి ప్రాథమిక విద్యార్థులకు నోట్ పుస్తకాలు కూడా పంపిణీ చేస్తున్నారు.

- ఖైరతాబాద్-1 మండలంలో ఏడు ప్రాథమిక, ఆరు ఉన్నత పాఠశాలలు ఉండగా, 15,389 పాఠ్య పుస్తకాలు, 2888 యూనిఫాంల తో పాటు ఈ ఏడాది కొత్తగా 12,872 నోట్ పుస్తకాలు అందాయి.
- ఖైరతాబాద్-2 మండలంలో 22 ప్రాథమిక, ఆరు ఉన్నత పాఠశాలలు ఉండగా. 31,811 పాఠ్య పుస్తకాలు పంపిణీ అయ్యాయి. ఇంకా 4923 పాఠ్యపుస్తకాలు అందాల్సి ఉంది. ప్రాథమిక విద్యార్థులకు 4562 వర్క్‌బుక్స్ తో పాటు కొత్తగా 10,822 నోట్ పుస్తకాలు పంపిణీ అయ్యాయి. తొలి విడతగా ఒక్కో విద్యార్థికి ఒకటి చొప్పున 7593 యూనిఫాంలు పాఠశాలలకు చేరుకున్నాయి.
- షేక్‌పేట్ మండలంలో 20 ప్రాథమిక, 5 ఉన్నత పాఠశాలలు ఉండగా. 26,811 పాఠ్య పుస్తకాలు, 4829 వర్క్ బుక్స్, 5912 యూనిఫాంలతో పాటు ఈ ఏడాది కొత్తగా 37,455 నోట్ పుస్తకాలు చేరుకున్నాయి.

షేక్‌పేట్ మండలంలో పాఠశాల ఉపాధ్యాయులకు నోట్ పుస్తకాల ఇండెంట్‌ను అందజేస్తున్న సిబ్బంది

### అన్ని పాఠశాలలకు అందజేశాం

అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, యూనిఫాం లు అందజేశాం. ఈ ఏడాది ప్రాథమిక విద్యార్థులకు కూడా నోట్ పుస్తకాలు వచ్చాయి. వాటిని అన్ని స్కూల్స్ కు పంపిణీ చేస్తున్నాము. కొన్ని చోట్ల హై స్కూల్స్ తోపాటు నేరుగా స్కూల్ పాయింట్ కే నోట్ పుస్తకాలు సరఫరా అవుతున్నాయి. ఖైరతాబాద్-2 మండలంలో అన్ని పాఠశాల లకు నోట్ పుస్తకాలు చేరుకున్నాయన్నారు.- *శ్రావణ్‌కుమార్, డిప్యూటీ ఐఓఎస్*

## సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

అల్కాపూర్ టౌన్షిప్ సమీపంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

### గుడ్ మార్నింగ్ మణికొండ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, జూన్ 6 : మణికొండ మున్సిపాలిటీ భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'గుడ్ మార్నింగ్ మణికొండ' పర్యటన అల్కాపూర్ టౌన్షిప్ రోడ్డు నంబర్ 6 అబ్దుల్ కలాం పార్క్ పరిసర ప్రాంతం, పుప్పాలగూడ గ్రామ శ్మశాన వాటికలను బీఆర్ఎస్ నాయకులు సందర్శించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

- అబ్దుల్ కలాం పార్క్ పరిసర ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు.
- ప్రస్తుతం మెహదీపట్నం బస్సు డిపో నుంచి అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 30 వరకు బస్సును పొడిగించాలని స్థానికులు నాయకులను కోరారు.
- పుప్పాలగూడ శ్మశాన వాటికలో నీటి కొరత లేకుండా చూడాలన్నారు.
- పుప్పాలగూడ శివనగర్ కాలనీ సర్వేనెంబర్ 161 మున్సిపల్ పార్క్ స్థలం కబ్జాకు గురై బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.
- చందన అల్కాపూర్ టౌన్‌షిప్‌లో అన్ని రోడ్డులలో వీధి శునకాల బెడద తీవ్రంగా ఉందని పలువురు విన్నవించారు. మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ స్థానిక నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, సుమనళిని, షేక్ ఆరిఫ్, రమణ మూర్తి, బాబు , చెరుకూరి బాలాజీ, యాలాల కిరణ్ డిమాండ్ చేశారు.

గంధంగూడలో నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొన్న అధికారులు

శంషాబాద్ ఊటుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్ దత్, తదితరులు

## సమస్యల పరిష్కారం కోసమే రైతు సదస్సులు

బండ్లగూడ,జూన్ 6: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి లో రైతుల సమస్యలను పరిష్కారం కోసం చేపట్టిన రైతు సదస్సు కార్యక్రమాలు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలో శుక్రవారం నిర్వహించారు.

### కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

శంషాబాద్ రూరల్: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి.

మండలంలోని ఊటుపల్లి, హరిగూడ, కిషన్‌గూడ గ్రామాల్లో తహసీల్దార్ రవీందర్ దత్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రైతుల సమస్యల పరిష్కారం కోసమే గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలలోని రైతులకు సమస్యలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మరో టీమ్ ఆధ్వర్యంలో మండలంలోని నానాజీపూర్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

## మోదీ సర్కార్‌లో చట్టాలు నిర్వీర్యం

### ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి చంద్రయ్య

శంషాబాద్ రూరల్, జూన్ 6: పోరాడితేనే చట్టాలు సాధించుకుంటామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి చంద్రయ్య పేర్కొన్నారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు సాధించుకున్న చట్టాలను నేడు నరేంద్రమోదీ ప్రభుత్వం దుర్మార్గంగా ఆ చట్టాలను నిర్వీర్యం చేసే కుట్రకు తేరలేపిందని ఆరోపించారు. కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి చట్టాలన్నిటిని వాటి పరిధిలోకి మార్చడం దుర్మార్గమని విమర్శించారు.

నరేంద్రమోదీ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వా మి, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, దత్తునాయక్, మల్లేష్, నాయక్, స్వామి, సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి,మహదేవ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల చివరి సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ అన్ని కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

### ఘనంగా రథోత్సవ వేడుకలు

హిమాయత్ నగర్‌లోని లిబర్టీ వద్ద గల తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత ఉత్సాహంగా కొనసాగాయి. భక్తుల సమక్షంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చరణలు, సన్నాయి మేళాలు, భక్తజన బృందాలు చెక్క భజనలు కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం, అశ్వ వాహనంపై స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, టీటీడీ ఉప కార్యనిర్వహణ అధికారి రమేష్ ,దాత వై.టివి త్రినాథ్ బాబు పాల్గొన్నారు. – హిమాయత్ నగర్ , జూన్ 6:

**మహాగణపతి అంకురార్పణలో ..** ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణం అంకురార్పణలో భాగంగా నిర్వహించిన కర్రపూజోత్సవానికి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గజ్జల ఆనంద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది కూడా అత్యధిక మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు. – ఖైరతాబాద్, జూన్ 6

**విగ్రహావిష్కరణ:** మరాఠా యోధుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో శివాజీ విగ్రహావిష్కరణ గ్రామ నాయకుడు హరిశంకర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్,తోకల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి తదితరులు హాజరై ఆవిష్కరించారు. – మణికొండ

## స్పా ముసుగులో సెక్స్ రాకెట్

### పురుషులకు స్త్రీలతో మసాజ్, ఆపై వ్యభిచారం
### పోలీసులకు పట్టుబడ్డ 10 మంది యువతులు,, ఏడుగురు విటులు, ఆరుగురు నిర్వాహకులు

వెంగళరావునగర్, జూన్ 6 : బయటికి చూడ్డానికి అవో స్పా సెంటర్లు..లోపల జరుగుతున్న తంతు వేరు. స్పా ముసుగులో సెక్స్ రాకెట్లను నిర్వహిస్తున్న కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, ఎస్.ఆర్.నగర్ పోలీసులు దాడులు నిర్వహించారు. 10 మంది యువతులు, ఏడుగురు విటులు, ఆరుగురు నిర్వాహకులు పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహించే స్థావరాలపై సీసీఎస్‌లోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, టాస్క్ ఫోర్స్, ఎస్.ఆర్.నగర్ పోలీసులు మూడు ప్రాంతాల్లోని స్పా సెంటర్లపై దాడులు నిర్వహించారు.

- బీకే గూడలోని ఓ అపార్ట్ మెంట్‌లోని ఫ్లాట్ అద్దెకు తీసుకుని మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సీసీఎస్ యాంటీ ట్రాఫికింగ్ వింగ్ పోలీసులు దాడులు నిర్వహించి యూసుఫ్ గూడకు చెందిన స్పా నిర్వాహకురాలు నడిమంటి అనూష (34) కార్మిక నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరైన విటుడు వినయ్ బాబుతో పాటు ఐదుగురు మహిళలను అరెస్టు చేశారు. కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం ఎస్.ఆర్.నగర్ పోలీసులకు అప్పగించారు.
- అమీర్ పేటలోని విఠల్ చాంబర్స్ లోని 2వ ఫ్లోర్‌లో గ్లోరీ ఆయుర్వేదిక్ ఫిజియోథెరపి హాస్పిటాలిటీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. బోరబండకు చెందిన స్పా నిర్వాహకులు టి.కల్యాణి(41),ఐడీపీఎస్ చింతల్‌కు చెందిన సి.అశోక్ కుమార్ (25), మియాపూర్‌కు చెందిన విటుడు ఎం.సాంబశివ రెడ్డితో పాటు నలుగురు మహిళలను అరెస్టు చేశారు. కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం ఎస్.ఆర్. నగర్ పోలీసులకు అప్పగించారు.
- అమీర్‌పేట్ గురుద్వారా సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఎన్. ఎస్.బ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్ పై ఎస్.ఆర్. నగర్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలు అదిలాబాద్‌కు చెందిన ఎన్.సుధ(30),కస్టమర్లు వెస్ట్ గోదావరికి చెందిన సాగిరాజు దినేష్ వర్మ, వరంగల్‌కు చెందిన జి.గౌతమ్, కుత్బుల్లాపూర్‌కు చెందిన ఎన్.రవికుమార్, బంజారాహిల్స్‌కు చెందిన చవన్ సురేందర్, గుంటూరుకు చెందిన పిన్ని ప్రవీణ్ కుమార్ తో పాటు వెస్ట్ బెంగాల్ కు చెందిన ఒక యువతిని అరెస్టు చేశారు. ఎస్.ఆర్. నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య

సమావేశంలో మాట్లాడుతున్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత

అత్తాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు

### కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్,జూన్ 6: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలలో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, బస్తీల్లోని ప్రైవేటు స్కూళ్లతో పోలిస్తే మంచి అధ్యాపకులు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారని కార్పొరేటర్ పేర్కొన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించడంలో తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ స్కూళ్లలో అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పిస్తారని అధ్యాపకులు తెలిపారు.

### ప్రైవేటు పాఠశాలలతో పోటీ

మైలార్‌దేవ్‌పల్లి: ప్రైవేటు పాఠశాలలతో ప్రభుత్వ పాఠశాలలు పోటీపడుతూ నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని బాబుల్‌రెడ్డినగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత అన్నారు. పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, ఆశ వర్కర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్యా బుద్ధులు నేర్పిస్తున్నారన్నారు. మౌలిక వసతులతో పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన కొనసాగుతుందన్నారు. ఈ ఈ సందర్భంగా నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ బలంగా ఉండాలంటే బేసిక్ విద్య బలంగా ఉండాలన్నారు.

ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

సమాజంలో స్థిరమైన మార్పు రావాలంటే పిల్లలకు మంచి విద్యా వాతావరణం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు అనిత, మాధ వి, ఆర్పీ హేమలత, ఆశ వర్కర్లు రేణుక, లక్ష్మి, మంగ, ఉపాధ్యాయులు వినోద్, పార్వ తీ, రాజేశ్వరి, హెల్పర్ సంగీత పాల్గొన్నారు.

### అత్తాపూర్‌లో...

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యారాలు శ్రీలత అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బడికి పంపించే పిల్లలకు మంచి చదువులు చెప్పడమే తమ బాధ్యతగా తీసుకుంటామని వివరించారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలతో పాదరక్షకులు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌సాగర్ న్నారు.

### పాలకమండలి ప్రమాణస్వీకారం సందర్భంగా..

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. 15మంది సభ్యులతో ఇటీవల దేవాదాయశాఖ కమిషనర్ కొత్త కమిటీని ప్రకటించారని ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు.దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మధు సమక్షంలో నూతన సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. కమిటీ సభ్యులుగా దినేష్‌కుమార్, ఎన్.సుదర్శన్‌రెడ్డి, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సాయిప్రకాష్, గీతాచౌదరి, యూ.సుబ్బారావు, గొంటి నర్సింగ్‌యాదవ్, జీ.శరత్‌బాబు, అర్జున్ యాదవ్, కళ్యాణి, కే.రాజేష్.జగదిష్,విజయ్‌కుమార్, కే.లక్ష్మణ్‌తో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు మురళీధరశర్మ ప్రమాణస్వీకారం చేశారు. త్వరలోనే కొత్త కమిటీ సమావేశం నిర్వహించి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.–బంజారాహిల్స్,జూన్ 6

## గో సంరక్షణ కోసం రథయాత్ర

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నిషీత, బాలకృష్ణ గురుస్వామి తదితరులు

ఖైరతాబాద్, జూన్ 6 : గో సంరక్షణ కోసం త్వరలోనే రథయాత్ర చేపడుతున్నామని జన్ ఉర్జామంచ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ నిషీత దీక్షిత్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేలాది గోవులను అక్రమ రవాణా చేస్తున్నా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందన్నారు. ప్రతి ఏటా గోవులను యథేచ్ఛగా వదిస్తున్నా మతాధిపతులు, హిందూ సంఘాలు ఎలాంటి ప్రకటనలు చేయడం లేదన్నారు.

## చంద్రరాజేశ్వరరావు ఆశయాలు సాధించాలి

హిమాయత్ నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో చంద్ర రాజేశ్వర రావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

హిమాయత్ నగర్ ,జూన్ 6: సమాజానికి తొలితరం కమ్యూనిస్టు నేత దివంగత చంద్రరాజేశ్వరరావు అందించిన సేవలు శ్లాఘనీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో చంద్ర చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండి కష్టజీవుల అభ్యున్నతి కోసం చంద్ర తన జీవితానే అంకితం చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పార్టీ శ్రేణులకు వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు మారుపాక అనిల్ కుమార్, రత్నాకర్‌రావు ,ఆర్.అంజయ్య నాయక్,మాజీద్ అలీఖాన్, సందీప్,సత్తి బాబు, విజయ్ పాల్గొన్నారు.

## బీఈడీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కుమెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 5వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.